క్లుప్తంగా

ఉగాది ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

చాగల్లు: బుధవారం ఉగాది సందర్భంగా మండలంలోని ఆలయాలను ముస్తాబు చేశారు.చాగల్లు, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, చిక్కాల తదితర గ్రామాల్లో గ్రామదేవతల ఆలయాలను చలువ పందిళ్లు, విద్యుత్తు దీపాలంకరణతో తీర్చిదిద్దారు. తెలుగు సంవత్సరాది ప్రారంభం సందర్భంగా పలుచోట్ల పంచాంగ శ్రావణానికి ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి పుంతలో ముసలమ్మ వారి ఉత్సవాలు

ఊనగట్ల ప్రధాన కూడలిలో కొలువైన పుంతలో ముసలమ్మ అనే కనకమహాలక్ష్మి వారి ఉత్సవాలు బుధవారం నుంచి నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణంలో విద్యుదీపాలంకరణ చేశారు. ఈనెల 25 వరకూ ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. రోజూ రాత్రి 9 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సుంకవల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు ఉగాది పురస్కారాలు

చాగల్లు: వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సుంకవల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉగాది పురస్కారాలు అందజేస్తామని ఆ ఫౌండేషన్ చైర్మన్ సుంకవల్లి వెంకన్న చౌదరి తెలిపారు. మార్కొండపాడులో బుధవారం మధ్యాహ్నం ఏర్పాటయ్యే కార్యక్రమంలో ఉత్తమ రైతులను, ఉత్తమ అధికారులను సన్మానిస్తామని తెలిపారు. అలాగే ఉత్తమ విద్యార్థులకు కూడా అవార్డులు, నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు.

నేటి నుంచి శక్తమ్మ వారి ఉత్సవాలు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడు, ఖండవల్లి గ్రామాల్లో కొలువైన శక్తమ్మ తల్లి జాతర మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ రెండు గ్రామాల్లో పెద్ద శక్తమ్మ, చిన్న శక్తమ్మ అమ్మవార్లుగా భక్తులు కొలుస్తారు. ఉగాది రోజున ప్రారంభమై, వారం రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తారు.

స్ఫటిక లింగానికి పుష్పయాగోత్సవం


వివిధ రకాల పూలలో స్ఫటిక లింగానికి అలంకారం

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో జాతీయ రహదారి పక్కనే కొలువైన ఉమా విశ్వేశ్వర స్వామివారి ఆలయం ప్రాంగణంలో స్ఫటిక లింగం ప్రతిష్ఠ జరిగి ఏడాదైంది. మొదటి వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం పుష్ప యాగోత్సవం నిర్వహించారు. స్ఫటిక లింగాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. తెల్లవారుజామున స్ఫటిక లింగానికి అభిషేకం నిర్వహించాక భక్తుల దర్శనానికి అనుమతించారు. వందలాది మంది భక్తులు స్ఫటిక లింగాన్ని తాకారు. ఈ స్ఫటిక లింగ దర్శనం ఉగాది వరకూ ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

నిడదవోలు రూరల్: ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరిగితే అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ టి.మూర్తిబాబు అన్నారు. మండలంలోని జీడిగుంట, ఉనకరమిల్లి గ్రామాల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామ సభలను మంగళవారం నిర్వహించారు. డీఆర్పీలు పి.కోటయ్య, బి.రవికిరణ్ పర్యవేక్షణలో సామాజిక తనిఖీ బృందం గతేడాది చేపట్టిన పనులపై వివరాలు నమోదు చేసుకున్నారు.

గురుకులం .. భవిష్యత్తు పదిలం

- అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశానికి భారీ డిమాండ్
- ఐదో తరగతి, జూనియర్ ఇంటర్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- గురువారం సాయంత్రంతో ముగియనున్న గడువు
- డివిజన్‌లో 320 సీట్ల భర్తీకి అవకాశం


కుమారదేవంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు

కొవ్వూరు: కార్పొరేట్ విద్యకు దీటైన విద్య అందిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సాంఘిక సంక్షేమ బాలికల విద్యాలయాల్లో ప్రవేశానికి డిమాండ్ ఏర్పడింది. ప్రవేశ పరీక్షకు ఏటా వేలాది విద్యార్థినులు పోటీ పడుతుండడం ఇందుకు నిదర్శనం. ఇక్కడ ఐదో తరగతిలో సీటు పొందిన విద్యార్థిని గురించి ఇంటర్మీడియెట్ వరకూ చూసుకోవాల్సిన అవసరం లేదనే భరోసా తల్లిదండ్రుల్లో ఏర్పడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో గురుకుల విద్యాలయాల్లో ప్రమాణాలు మెరుగుపడ్డాయి. దీనికితోడు అనుభజ్ఞులైన అధ్యాపకుల బోధన, పౌష్టికాహారం, ఆహ్లాదకరమైన, సురక్షిత ప్రాంగణం, వసతి, పుస్తకాలు, యూనిఫాం వంటివన్నీ ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. దాంతో ఇక్కడి విద్యార్థినులు చదువులో రాణిస్తున్నారు.

ఐదు తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఇంగ్లిషు మీడియంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 24 సాయంత్రం ఐదు గంటల వరకూ దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఇచ్చారు. ఏప్రిల్ 23 ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతికి, అదే రోజు మధ్యాహ్నం రెండు నుంచి 4.30 గంటల వరకూ ఇంటర్మీడియెట్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

అర్హతలు ఇవీ...

- ఐదో తరగతి ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారై ఉండాలి.
- బీసీ,ఓసీ విద్యార్థినులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 లోపు జన్మించిన వారై ఉండాలి.
- 2022-23 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినులు ఐదో తరగతిలో ప్రవేశానికి అర్హులు.
- ఇదే విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుతున్న విద్యార్థినులు జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులు.
- అభ్యర్థినుల కుటుంబ ఆదాయం రూ.లక్షకు మించరాదు.

ఇంటర్ ఫస్టియర్

విద్యాలయం పేరు	ఐదో తరగతి	బైపీసీ	ఎంపీసీ
కుమారదేవం(బాలికలు)	80	40	40
గోపాలపురం(బాలికలు)	80	40	40
మొత్తం సీట్లు	160	80	80

గురుకులాల్లో ఇవీ ప్రత్యేకతలు

- ఐఐటీ, నీట్, ఎంసెట్ సీటు సంపాదించేలా నిపుణులతో శిక్షణ
- బోధన అంతా ఇంగ్లిషు మీడియంలోనే
- ఎనిమిదో తరగతి నుంచి సీబీఎస్ఈ విద్యాబోధన
- డిజిటల్ తరగతులు, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లిషులో శిక్షణ
- పాఠ్యాంశాలతో పాటు క్రీడలు, యోగా, కరాటీ వంటి వాటిలోనూ శిక్షణ
- ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థినులకు స్టడీ అవర్స్
- ఇంటర్‌లో చేరేటపుడే నీట్, ఐఐటీలలో ఏదో ఒకటి విద్యార్థినులు ఎంపిక చేసుకోవాలి.

దరఖాస్తు చేయడం ఎలా?



ఏదైనా నెట్ సెంటర్‌లో గానీ, గురుకుల పాఠశాలల్లోగానీ దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థిని ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్స్, తల్లి బ్యాంకు ఖాతా జిరాక్సు, కులధ్రువీకరణ పత్రం, మొబైల్ ఫోన్ నంబర్‌లో లింకైన ఆధార్ కార్డు సమర్పించాలి. ఈనెల 24 సాయంత్రం ఐదింటి లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వెబ్‌సైట్ ద్వారానే ప్రవేశ పరీక్షకు వారం రోజుల ముందు హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏపీజీపీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/ఇంటర్, ఏపీజీపీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/5 వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

–పి.సుజాత, ప్రిన్సిపాల్, అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయం, కుమారదేవం

గోటితో ఒలిచిన తలంబ్రాలతో శోభాయాత్ర


శోభాయాత్రగా జగన్నాథపురం నుంచి గోటితో ఒలిచిన తలంబ్రాలు తీసుకెళుతున్న భక్తులు

నల్లజర్ల: శ్రీరామనామ స్మరణతో ఎంతో పవిత్రంగా గోటితో ఒలిచిన తలంబ్రాలను శోభాయాత్రగా భక్తులు జంగారెడ్డిగూడెంలోని శ్రీరామ ఆధ్యాత్మిక సేవాసమితి సభ్యులకు మంగళవారం అందజేశారు. అక్కడి నుంచి ఈ తలంబ్రాలను భద్రాచలరం రామాలయానికి తీసుకువెళతారు. నల్లజర్ల మండలం జగన్నాథపురం రామాలయంలో నెల రోజులుగా సీతారామ భజనమండలి ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన తలంబ్రాలను సిద్ధం చేశారు. స్థానిక రామాలయం వద్ద పుసులూరి శ్రీను దంపతులు ప్రత్యేక పూజల అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ధార్మికమండలి, సమరసత సేవాసమితి సభ్యులు, ముళ్ళపూడి సత్యనారాయణ, వెదుళ్ళ రామకృష్ణ, సర్పంచ్ చెల్లారి రామశ్రీనివాస్, గన్నిన సుబ్బారావు, నవలం రామకృష్ణ, గుదే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరునికి రుద్రాభిషేకం

నిడదవోలు రూరల్: పట్టణంలో కొలువైన సోమేశ్వర శివ పంచాయతన క్షేత్రంలో బాలాత్రిపుర సుందరి సహిత సోమేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ఘనంగా రుద్రాభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి కుంకుమ పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. పూర్ణాహుతి, త్రిశూల స్నానం, వసంతోత్సవం, ధ్వజారోహణం, పుష్పయాగోత్సవం, పవళింపు సేవతో ఉత్సవాలు ముగిసినట్లు ఈఓ సోమాల శివ తెలిపారు.



పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నల్లజర్ల: అనంతపల్లి వద్ద ఎర్రకాలువ గట్టుపై నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం నల్లజర్ల ఎస్ఐ నరసింహమూర్తి తమ సిబ్బందితో కలసి దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని రూ.18,200 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

నేటి నుంచి నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు


నిర్మలగిరిలోని మేరీమాత మండపం

దేవరపల్లి: నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు బుధవారం ప్రారంభం అవుతున్నాయి. ఈ నెల 25 వరకూ కొనసాగుతాయి. ఇందుకు ఏలూరు పీఠాధిపతి జయరావు పొలిమెర పర్యవేక్షణలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్, ఉత్సవ నిర్వహణ కమిటీ, సహాయక ఫాదర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. గౌరీపట్నాన్ని అనుకుని ఈ క్షేత్రం ఉంది. కులమతాలకు అతీతంగా భక్తులు మేరీమాతను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. 1978లో బిషప్ జాన్ ములగాడ గౌరీపట్నం ప్రాంతంలో మేరీమాత ఆలయం నిర్మాణానికి సంకల్పం చేశారు. ఆయన తొలి పీఠాధిపతి కూడా. ఏటా మార్చిలో నిర్వహించే ఉత్సవాల్లో మతాలకు అతీతంగా భక్తులు హాజరై, కొబ్బరికాయలు కొడతారు. కొవ్వొత్తులు వెలిగిస్తారు. తలనీలాలు సమర్పించి దైవదూత అనుగ్రహం కోసం ప్రార్థిస్తారు. ఉత్సవాల్లో భాగంగా దివ్య బలి పూజలు, దివ్య సత్ప్రసాద ఆరాధనలు నిర్వహిస్తారు. వాటికన్ భారత రాయబారి, ప్రాన్సిస్ మోస్ట్ రెవరెండ్ లియోపోల్డో జిరెల్లి, ఏలూరు పీఠాధిపతి జయరావు పొలిమెర బుధవారం హాజరై సమష్టి దివ్య బలిపూజ సమర్పిస్తారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అగ్ర పీఠాధిపతులు ఈ నెల 25న పుణ్య క్షేత్రానికి వచ్చి పూజల్లో పాల్గొంటారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశాల వినతి

చాగల్లు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కె.ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కేకే దుర్గారావు మాట్లాడుతూ ఆశాలకు పనిభారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఆశా కార్యకర్తల సంఘం మండల శాఖ అధ్యక్షురాలు జి. వెంకటలక్ష్మి, మంగతాయారు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: ఆశా కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆశ వర్కర్ల యూనియన్ గౌరవా ధ్యక్షుడు జువ్వల రాంబాబు కోరారు. ఏపీ ఆశా కార్యకర్తల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిడదవోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తలు మంగళవారం ధర్నా చేశారు. ఆశా కార్యకర్తలపై పనిభారం తగ్గించాలంటూ నినాదాలు చేశారు.

'సరిపల్లి' కి మదర్ థెరిసా అవార్డు

నిడదవోలు రూరల్: కంసాలిపాలేనికి చెందిన ఎస్ఆర్ సంజీవనీ హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకుడు, రక్తదాత సరిపల్లి రమణ మదర్ థెరిసా అవార్డు అందుకున్నారు. రాజమహేంద్రవరంలో ఆదర్స్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ప్రదానోత్సవంలో రుడా చైర్‌పర్సన్ షర్మిళారెడ్డి చేతుల మీదుగా తాను మదర్‌థెరిసా అవార్డు అందుకున్నట్లు రమణ తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యమే జగనన్నకు మహాభాగ్యం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- స్కూళ్లలో రాగిజావ పంపిణీ ప్రారంభం


గోపాలపురం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినులకు రాగి జావ అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: విద్యార్థుల ఆరోగ్యమే మహాభాగ్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో అదనంగా ప్రభుత్వం విద్యార్థులు రాగి జావను అందిస్తోంది. విద్యార్థులకు ఈ రాగిజావ పంపిణీని గోపాలపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు, ఎస్ఎంసీ చైర్మన్ గుంజే వెంకటరమణ, రాష్ట్ర క్రీడల విభాగం డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, ఎంఈఓ.జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీని ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లికొండ రామలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు, మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు వెలగా శ్రీనివాస్, కడిమి రాజు, ఇన్‌చార్జ్ హెచ్ఎం ఉస్సే శంకరుడు పాల్గొన్నారు.

నల్లజర్ల: అనంతపల్లి హైస్కూల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీని ఎంపీపీ బంక జయలక్ష్మి ప్రారంభించారు. సర్పంచ్ కమల కుమారి, ఎంపీటీసీ సభ్యుడు యడ్లపల్లి మార్త, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొయ్యాన సత్యనారాయణ, బంక అప్పారావు,హెచ్ఎం రామారావు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: నిడదవోలులోని ఎల్ఎల్ఆర్, ఉర్దూ పాఠశాలల విద్యార్థులకు రాగి జావ పంపిణీని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు ప్రారంభించారు. లింగంపల్లి పాఠశాలలో కౌన్సిలర్ మద్దిపాటి నాగశ్రీ, వైఎస్సార్ సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు మద్దిపాటి ఫణీంద్రలు రాగిజావ అందించారు.

నిడదవోలు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి ప్రారంభించారు. తాడిమళ్ల ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ కొప్పుల నాగేశ్వరరావు, సర్పంచ్ బయ్యే రాధారాణి, ఎంపీడీఓ టి.మూర్తిబాబు, ఎంఈఓ డి.కిషోర్‌కుమార్ విద్యార్థులకు రాగి జావ అందజేశారు. కంసాలిపాలెంలో సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్, పెండ్యాలలో సర్పంచ్ కారింకి అన్నవరం, పందలపర్రు, సమిశ్రగూడెంలలో వైఎస్సార్ సీపీ నాయకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు రాగి జావ అందించారు.

పెరవలి: మండలంలోని ఖండవల్లి, పెరవలి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ పంపిణీని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు బి.వినీత, రాష్ట్ర చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యుడు డాక్టర్ జె.రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంఈఓ డి.హైమావతి, ఎంపీటీసీ సభ్యుడు బొకే వెంకటేశ్వర్లు, సర్పంచ్ గంగోలు సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక ఉన్నత పాఠశాల్లో రాగి జావ పంపిణీని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి ప్రారంభించారు. దమ్మెన్నులో సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ, ఉండ్రాజవరంలో సర్పంచ్ మెండే వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు గాడి కృష్ణఫర్, పసలపూడిలో సర్పంచ్ కట్టా లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కట్టా విజయలక్ష్మి, చామర్తి తమ్మిరాజు తదితరులు విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు.

కొవ్వూరు: వాడపల్లి హైస్కూల్లో ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) రాగి జావ పంపిణీని ప్రారంభించారు. ఎంఈవో జె.కెంపురత్నం, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు. పెనకనమెట్టలో ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, ఐదో వార్డులో కౌన్సిలర్ మద్దిపట్ల సాయిగీత, అచ్చాయమ్మ కాలనీ స్కూల్లో రామా సొసైటీ అధ్యక్షుడు దేవగుప్తాపుల క్ష్మణరావు చేతుల మీదుగా రాగిజావ పంపిణీని ప్రారంభించారు.

చాగల్లు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో రాగిజావ పంపిణీని ఎంపీపీ మట్టా వీరాస్వామి ప్రారంభించారు వైస్ ఎంపీపీ చెల్లింకుల శ్రీవిజయ, ఎంపీడీవో బి.రాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.అర్జునరావు, ఎంఈవో వి.ఖాదర్‌బాబు, వెలుగు ఏపీఎం మంగాయమ్మ పాల్గొన్నారు.నెనెలటూరు పాఠశాలలో ఎంపీటీసీ సభ్యురాలు తాళ్లూరి రమ్య, ఊనగట్ల జెడ్పీ హైస్కూల్లో సర్పంచ్ మట్టా వెంకట్రావు, చంద్రవరం యూపీ స్కూల్‌లో సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి, బండి అశోక్ బాబు విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు.

తాళ్లపూడి: వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు, ఎంఈవో కె. వివేకానంద, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యం

పెరవలి: పరిశుభ్రతతోనే ఆర్యోగం సాధ్యమని మలేరియా తణుకు సెక్టార్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. మలేరియా ప్రబలకుండా పాటించాల్సిన నివారణ చర్యలపై ఆయన మండలంలోని కానూరు, తీపర్రు గ్రామాల్లో మంగళవారం ఇంటింటా తిరిగి ప్రజలను చైతన్య పరిచారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల వద్ద మురుగు నిలిచిపోతే దోమల ఉధృతమై, మలేరియా వాధి ప్రబలడానికి కారణమవుతుందన్నారు. అలాగే రుబ్బురోళ్ళు, కొబ్బరి బొండాలు, కుండీలు, ఫ్రిజ్‌లు, వాటర్ ట్యాంకులు, ఫ్లవర్ వాజ్‌లలో దోమల అధికంగా ఉంటాయని తెలిపారు. వీటిని వారానికి ఒక్కసారి శుభ్రపరుచుకోవాలని, లేని పక్షంలో దోమల లార్వా పెరుగుతాయని వివరించారు. వైద్య సిబ్బంది ప్రతి శుక్రవారం డ్రై డేగా నిర్ణయించి గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతులుగా చేస్తున్నా కొందరు నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది డి. నారాయణరావు, జి.దుర్గా ప్రసాద్, ఎం. రాంబాబు, తాతాజీ, శ్రీనివాస్, వెంకాయమ్మ, కోమలి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట ముగ్గురి బైండోవర్

కొవ్వూరు: తాళ్లపూడి మండలంలో సారా కేసుల్లో నిందితులైన ముగ్గురు వ్యక్తులను తాళ్లపూడి తహసీల్దార్ ఎదుట మంగళవారం బైండోవర్ చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీపీ సత్యనారాయణ తెలిపారు. తుపాలకులగూడేనికి చెందిన బాలం రామకృష్ణ, జుత్తిగ పవన్‌కుమార్, వేగేశ్వరపురానికి చెందిన మారిశెట్టి వరప్రసాద్‌లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

డి. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి., ఏలూరు జిల్లా, ఏలూరు, బ్రాంచి : నిడదవోలు

బహిరంగ వేలము ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా, నిడదవోలు మండలం, నిడదవోలు మున్సిపాలిటీలోగల డి.సి.సి.బ్యాంకు బ్రాంచి: నిడదవోలు ఆఫీసు నందు ఈ దిగువ తెల్పిన బకాయిదారులు సదరు బ్యాంకులో బ్యాంకు గ్యారంటీ తీసుకొని తిరిగి చెల్లించకపోవుట వలన ది.18.10.2022వ తేదీన OSD/DCCB Ltd. ఏలూరు కోర్టువారిచే, ముందుగా జప్తు చేయబడిన స్థిరాస్తులను ఈ దిగువ తెల్పిన తేదీలలో సేల్ ఆఫీసర్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఏలూరు బ్రాంచి నిడదవోలు వారి ఉత్తర్వులు ప్రకారం ది.30.03.2023వ తేది గురువారం రోజున డి. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఏలూరు బ్రాంచి నిడదవోలు సేల్ ఆఫీసర్ వారిచే చిన్నాయిగూడెం LSCS బ్రాంచి యాదవోలు నందు ఈ దిగువ తేదీలలో బహిరంగ వేలము వేయబడును. కావున ఆసక్తి కలవారు వేలం పాటలో పాల్గొనవచ్చును.

ఇ.పి.నెం.	బకాయి బాకీదారుని పేరు	ఆస్తి ఉన్న గ్రామం	సర్వే నెం.	విస్తీర్ణం యం.ట్లు	సరిహద్దులు	చెల్లించవలసిన మొత్తము	వేలము వేయు తేదీ, సమయం, స్థలము
245/ 20-21	విజయదుర్గ రైస్ మిల్లు ప్రో : కలకంటి భ్రమీల భర్త : సత్యనారాయణ గ్యారెంటార్ : అనిశెట్టి వెంకటేశ్వర రావు, తండ్రి : వీరన్న	యాదవోలు గ్రామం దేవరపల్లి మండలం	784/2	Ac.1.10 Cents	కలవు	రూ.43,55,577/- + తదుపరి వడ్డీ + ఇతర ఖర్చులు	ది.30.03.2023 ఉ.11.00 లకు చిన్నాయిగూడెం LSCS బ్రాంచి : యాదవోలు
			785/1	196 Sq. Yds (Plint Area 510 Sq.Fts)	కలవు		

షరతులు : 1) వేలములో పాల్గొనదలచిన వారు వేలముపేయు అధికారి వద్ద రూ.10.000/-ల ధరావత్తు ముందుగా చెల్లించి పాటలో పాల్గొనవలెను. 2) వేలము పాట అయిన వెంటనే హెచ్చుపాటదారుకు వేలము ఖరారు చేయబడును. సదరు సొమ్ములో 15% పాట పూర్తి అయిన వెంటనే చెల్లించవలెను. 3) మిగిలిన సొమ్ము వేలము తేదీ నుండి 15 రోజులలో పూర్తిగా చెల్లించవలెను. 4) సి.డి.ఆర్/ఓ.యస్.డి డి.సి.సి బ్యాంకు, ఏలూరు వారి నుండి క్రయ దస్తావేజులు సొంత ఖర్చులపై రిజిస్టరు చేయించుకొనవలెను. 5) వేలము పాట ఏ కారణము చూపకనే రద్దు పరచుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ సేల్ ఆఫీసర్ వారికి సర్వహక్కులు వున్నవి. 6) వేలమునకు సంబంధించిన వివరములు సేల్ ఆఫీసర్ ద్వారా గానీ, మేనేజర్ నిడదవోలు బ్రాంచ్, డి.సి.సి బ్యాంకు వారి ద్వారా గాని తెలుసుకొనవచ్చును. 7) పాటదారులు ఎవరూ హాజరు కాని యెడల సదరు వేలము వేయు అన్నులు బ్యాంకుకు దాఖలు చేయబడును. 8) బాకీదారులు తనఖా పెట్టబడిన పై స్థిరాస్తిపై సంఘమునకు గానీ, మరేయితర బకాయిలున్ననూ గానీ, సదరు బకాయి పాట సొమ్ము నుండి వసూలు చేయబడును.

స్థలము : నిడదవోలు
తేది : 21.03.2023

సం/-గుబ్బా రాజేంద్ర ప్రసాద్
సేల్ ఆఫీసర్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి., ఏలూరు
బ్రాంచి : నిడదవోలు